క్లుప్తంగా

28న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 28న మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ఉదయం 11గంటలకు నిర్వహించ నున్నట్లు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్నట్లు, పాలకవర్గ సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

'నీలగిరి కవుల చరిత్ర' పుస్తకాలు అందజేత


కలెక్టర్ నారాయణరెడ్డికి పుస్తకాలు అందజేస్తున్న కవి అంజయ్య

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణానికి చెందిన కవి పున్నమి అంజయ్య రచించిన 'నీలగిరి కవుల చరిత్ర' రెండు భాగాల పుస్తకాలను స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కవి అంజయ్య మాట్లాడుతూ.. సుమారు వెయ్యి పేజీలు కలిగిన ఈ పుస్తకాల్లో ఉమ్మడి నల్లగొండ సమగ్ర సమాచారంతో పాటు ప్రాచీన ఆధునిక కవులు, రచయితలు, చరిత్రుల సమాచారం రూపొందించినట్లు పేర్కొన్నారు.

క్విజ్ విజేతలకు అభినందన


విద్యార్థిని అభినందిస్తున్న డీఈఓ భిక్షపతి

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని బోయ్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఇటీవల హైదరాబాద్‌లో రెడ్‌రిబ్బన్ యూత్ ఫీస్ట్ 2024 ఆధ్వర్యంలో ఎయిడ్స్ నిర్మూలనపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో సీహెచ్.అవినాష్, కె.విశాల్ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా డీఈఓ భిక్షపతి శనివారం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సమగ్ర శిక్షా క్వాలిటీ కో ఆర్డినేటర్ ఆర్.రామచంద్రయ్య, హెచ్ఎం ఎండీ. యూసుఫుద్దీన్, ఉపాధ్యాయుడు ఎండీ. అలీముద్దీన్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపిక


మెడల్స్ సాధించిన విద్యార్థులు

నార్కట్‌పల్లి : నల్లగొండ పట్టణంలోని ఎన్‌జీ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) డివిజన్ స్థాయి అండర్-14, అండర్-17 బాల బాలికల కబడ్డీ పోటీల్లో నార్కట్‌పల్లి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్- 14 బాలికల కబడ్డీ విభాగంలో ప్రథమ బహుమతి, అండర్-17లో బాలికల కబడ్డీ విభాగంలో ద్వితీయ బహుమతి సాధించి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం రాములు, పాఠశాల పీడీ బండారు రామస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్- 17లో బాలుర విభాగంలో కొత్తూరి చరణ్, బాలికల విభాగంలో మాలతి, అండర్- 14 బాలుర విభాగంలో బాస లోకేష్, బాలికలు బగ్గు కావ్యశ్రీ, వర్రె గాయత్రి, నడింపల్లి జ్యోత్స్న, దండుగుల అనురాధ, ఆర్య షణ్ముకి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల అర్హత


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : పట్టణానికి చెందిన ఓక్ ట్రీ పాఠశాల విద్యార్థులు రామానుజన్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల చైర్మన్ గింజల నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను స్థానిక పాఠశాలలో శనివారం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పాఠశాలకు చెందిన 22మంది విద్యార్థులు ఒలింపియాడ్ పరీక్షలో అర్హత సాధించారన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గద్దం మంగారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిలిచిన 'ఆయుష్' సేవలు

- వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో అందని వైద్యసేవలు
- వారం రోజులుగా మందులు లేక రోగుల అవస్థలు
- వెంటనే సిబ్బందిని నియమించాలని వేడుకోలు


సిబ్బంది లేకపోవడంతో ఖాళీగా ఉన్న ఆస్పత్రిలోని మందుల గది

కేతేపల్లి : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో వైద్యసేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆస్పత్రిలో కనీసం మందులు ఇచ్చే వారు కూడా లేకపోవడంతో రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పదేళ్ల క్రితం ఆయుర్వేద వైద్యశాలను ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ భవనంలోకి ఇరుకైన ఒకే గదిని ఆయుర్వేద వైద్యశాల నిర్వహణకు కేటాయించారు. ఈ ఆస్పత్రిని ప్రారంభించిన ప్రారంభంలో ఒక ఆయుర్వేద వైద్యాధికారి, ఫార్మసిస్టులు, అటెండర్ పోస్టులను కేటాయించారు. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం అటెండర్ అనారోగ్యంతో మృతి చెందడంతో అతడి భార్యకు ఉద్యోగం ఇచ్చారు. కొన్ని రోజుల పాటు ఇక్కడ విధుల నిర్వహించిన ఆమె అనంతరం డిప్యుటేషన్‌పై మరో చోటికి బదిలీపై వెళ్లారు. ఆస్పత్రిలో పదేళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారి ఇటీవల జరిగిన శాఖపరమైన బదిలీల్లో భాగంగా హైదరాబాద్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో బదిలీపై హైదరాబాద్ నుంచి వచ్చిన ఓ మహిళా వైద్యాధికారి కనీసం నెలరోజులు కూడా ఇక్కడ విధులు నిర్వహించకుండా కొద్దికాలానికే డిప్యుటేషన్‌పై తిరిగి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. ఆస్పత్రిలో నాటి నుంచి ఫార్మాసిస్టు ఒక్కడే అన్నీ తానై ఆసుపత్రిని నిర్వహించాడు. కాని అతడికి వారం రోజుల క్రితం గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. దీంతో ఆస్పత్రి నిర్వహణ బాధ్యతలు ఎవరికి అప్పగించకపోవడంతో వారం రోజుల నుంచి ఆయుర్వేద ఆస్పత్రిని పట్టించుకునే వారు లేక వైద్యసేవలు పూర్తిగా నిలిచిపోయాయి.

మందుల కోసం రోగుల అవస్థలు..

మండలంలోని 16గ్రామాల నుంచి నిత్యం 25నుంచి 30మంది ఆయుర్వేద వైద్యం కోసం ఈ ఆస్పత్రికి వస్తుంటారు. ప్రధానంగా బీపీ, షుగర్, చర్మవ్యాధులు, కీళ్ల నొప్పుల వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులు నెలకు సరిపడా ఆయుర్వేద మందులు తీసుకెళ్తుంటారు. వారం రోజుల నుంచి ఆసుపత్రిలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. క్రమం తప్పకుండా మందులు వేసుకుంటనే దీర్ఘకాలిక వ్యాధులు నియంత్రణలో ఉంటాయి. మధ్యలో నిలిపితే వ్యాధులు తిరగబెట్టే ప్రమాదముందని బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమీప మండలాల్లోని అస్పత్రిలో పని చేసే సిబ్బందికి ఇక్కడ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించి వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి



దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న దాదాపు వెయ్యి మంది వరకు ప్రతి నెలా ఈ ఆస్పత్రికి వచ్చి ఆయుర్వేద మందులను తీసుకెళ్తారు. ఆసుపత్రిలో సిబ్బంది లేకపోవడంతో వారం రోజులుగా వైద్య సేవలు, మందులు అందడం లేదు. అధికారులు స్పందించి ఆసుపత్రిలో వైద్యసేవలు అందించాలి.

– కోట వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్, చీకటిగూడెం

రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతుంది

- నల్లగొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మునుగోడు : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 10నెలల కాలంగా నియంతపాలన కొనసాగిస్తుందని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆరోపించారు. నల్లగొండ పరిధిలోని అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో శనివారం పోలీసులు చేస్తున్న నిరసనకు మద్దతుగా ఆయన వెళ్తుండగా పోలీసులు అడ్డుకొని మునుగోడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు బీఆర్ఎస్ నాయకులు పెద్దఎత్తున మునుగోడు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది సమయంలోనే ప్రజల ఆదరణ కోల్పోయిందన్నారు. పేద ప్రజలు, ఉద్యోగులు తమ హక్కుల కోసం ఉద్యమిస్తుంటే అక్రమంగా అరెస్ట్‌చేసి బెదిరింపులకు గురిచేస్తుందన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్, నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మారగోని అంజయ్యగౌడ్, ఈద శరత్‌బాబు, ఐతగోని విజయ్‌గౌడ్, మేకల శ్రీనివాస్‌రెడ్డి, మడవల్లి సురేష్, దోటి కరుణాకర్, వరంగటి శంకర్, ఎల్లంకి యాదయ్య ఉన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక


వినయ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న వినయ్ పాటిల్ జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ తెలిపారు. ఈ సందర్భంగా వినయ్ పాటిల్‌ను శనివారం ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరపున వినయ్ పాటిల్ పాల్గొననున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పిల్లి సురేష్‌బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పరంగి రవికుమార్, సీఓఈ బి.నాగరాజు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- డీఎస్ఓ వెంకటేశ్వర్లు


కట్టంగూర్ : అయిటిపాముల ఐకేపీ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్ఓ వెంకటేశ్వర్లు

కట్టంగూర్ : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి(డీఎస్ఓ) వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని అయిటిపాముల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను, ధాన్యం మ్యాచ్చర్‌ను పరిశీలించి మాట్లాడారు. రైతులు ధాన్యం మ్యాచ్చర్ 17శాతం లోపు ఉండే విధంగా చూసుకొని కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీటీసీఎస్ రాచకొండ జ్యోతి, ఏపీఎం కస్పరాజు సైదులు, సీసీ కారింగు శంకర్, కొనుగోలు కమిటీ సభ్యులు జక్కలి భవాని, లక్ష్మి, రెహానాబేగం తదితరులు ఉన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

కేతేపల్లి : కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులకు కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి(డీఎస్ఓ) వెంకటేశ్వర్లు సిబ్బందికి సూచించారు. మండలంలోని ఇనుపాముల గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం రాశుల్లో తేమశాతాన్ని మిషన్‌తో పరిశీలించారు. ధాన్యం తూకాలలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఆయన వెంట నకిరేకల్ డీటీసీఎస్ జ్యోతి, పీఏసీఎస్ సిబ్బంది తండు వెంకన్న తదితరులు ఉన్నారు.

ఐకేపీ సెంటర్‌ను పరిశీలించిన తహసీల్దార్

కనగల్ : మండలంలోని జి యడవల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం తహసీల్దార్ పద్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు ఐకేపీ కేంద్రాలకు అరబెట్టిన ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. తేమ శాతాన్ని దృష్టిలో ఉంచుకుని కాంటా వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. కేంద్రాల్లో రైతులుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చూసుకోవాలన్నారు. ఆమె వెంట డీటీ జ్యోత్స్న, ఏపీఎం సంకు హరి, సీసీ ప్రభాకర్, పోలే విజయ్‌కుమార్, లింగస్వామి, రమణ, రైతులు ఉన్నారు.

క్షేత్ర సందర్శనతో పరిశోధనాసక్తి పెంపొందుతుంది


చెర్వుఅన్నారంలో వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

కట్టంగూర్ : విద్యార్థులు విద్య నేర్చుకోవడంతో పాటు వ్యవసాయ క్షేత్ర సందర్శనలు చేయడంతో పరిశోధనాసక్తి పెంపొందుతుందని నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యుడు డా.బెల్లి యాదయ్య అన్నారు. శనివారం నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మండలంలోని చెర్వుఅన్నారం, అయిటిపాముల గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా బెల్లి యాదయ్య మాట్లాడుతూ.. భూమి రైతులకు నష్టం చేయదని, రైతులు అత్యాశతో కూడిన విధానాలను వ్యవసాయంలో అనుసరించడంతోనే నష్టపోతున్నారని తెలిపారు. వ్యవసాయ నిపుణుల సలహాలు సూచనలు తీసుకొని ఆధునిక పద్ధతుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సాగుచేసి లాభాలు పొందవచ్చన్నారు. అనంతరం క్షేత్ర సందర్శనకు రిసోర్స్‌పర్సన్‌గా వచ్చిన ఉద్యానవన అధికారి రావుల విద్యాసాగర్ మాట్లాడారు. పంటల యాజమాన్య పద్ధతులు, వివిధ రకాల పండ్లు, కూరగాయల మొక్కల పెంపకం, వివిధ రకాల యంత్రాల పనితీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం నాగు, ఎఫ్‌పీఓ సైదమ్మ, అధ్యాపకులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, హరిత, శంకర్, శ్రీనివాసాచారి, శివశంకర్, నర్సింహాచారి, సతీష్, సయ్యద్, కార్తీక్ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

రోడ్డు ప్రమాదంలో కూలీలకు తీవ్రగాయాలు

నార్కట్‌పల్లి : రోడ్డు ప్రమాదంలో పత్తి కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ఎల్లారెడ్డిగూడెం పరిధిలోని రాంనగర్‌కాలనీ సమీపంలో నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 10మంది వలస కూలీలు పత్తి తీసేందుకు వచ్చి పనులు ముగించుకొన్న ట్రాక్టర్‌లో బయలుదేరారు. ట్రాక్టర్ డ్రైవర్ ఎల్లారెడ్డిగూడెం వద్ద యూటర్న్ తీసుకుంటుండగా నార్కట్‌పల్లి నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న లారీ ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లోని ముగ్గురు మహిళలకు తీవ్రగాయాలు కాగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

సీసీఐ కేంద్రాలను ప్రారంభించాలి

నకిరేకల్ : సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల అన్నారు. శనివారం మండలంలోని కడపర్తి గ్రామంలో నిర్వహించిన పార్టీ గ్రామశాఖ మహాసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి రాచకొండ వెంకట్‌గౌడ్, పట్టణ కార్యదర్శి వంటెపాక వెంకటేశ్వర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడికి సన్మానం

చిట్యాల : మండలంలోని ఉరుమడ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వల్లాల రాంమూర్తి ఇటీవల కొండమల్లేపల్లి ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. శనివారం స్థానిక పాఠశాల ఆవరణలో వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించి రాంమూర్తిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం లెంకల మాధవరెడ్డి, ఉపాధ్యాయులు బొప్పని యాదయ్య, స్వామి ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

కనగల్ : మండల కేంద్రంలో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వైఆర్‌జీ కేర్ ఆధ్వర్యంలో శనివారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉచిత క్యాంపు నిర్వహించి గ్రామస్తులకు షుగర్, రక్తనమూనా, ఎయిడ్స్ పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఆర్‌జీ కేర్ లింక్‌వర్కర్ సింగపంగ వెంకన్న ప్రభుత్వ ఆసుపత్రి డీఎస్ ఆర్‌సీ కౌన్సిలర్ లింగస్వామి, ఎస్ఎస్‌కే మేనేజర్ కొత్తపల్లి రమేష్, సీడబ్ల్యూఎస్ రజిత, ఏఎన్ఎం గీతారాణి, అంగన్‌వాడీ టీచర్ స్వరాజ్యం, ఆశవర్కర్లు ఉన్నారు.

సదర్ సమ్మేళన పోస్టర్ ఆవిష్కరణ

కేతేపల్లి : హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 27న నిర్వహించనున్న యాదవుల సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. శనివారం మండల కేంద్రంలో సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జటంగి లక్ష్మమ్మ, యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ ఉపాధ్యక్షుడు జటంగి వెంకటనర్సయ్య యాదవ్, సంఘం మండల అధ్యక్షుడు వీరబోయిన గురుస్వామి, బయ్య అంజయ్య, బయ్య ముత్తయ్య, జటంగి సైదులు, మున్న నవీన్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిప్పర్తి : కేతేపల్లి మండంలోని భీమారం వాగు నుంచి నకిరేకల్ మండలంలోని గోరెంకలపల్లి గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం మండల పోలీసులు మామిడాల క్రాస్ రోడ్డు వద్ద పట్టుకున్నారు. ట్రాక్టర్ యజమానులు కేతేపల్లి మండలంలోని కొప్పోలు గ్రామానికి చెందిన మాతంగి నవీన్, ఆలకుంట్ల రాంబాబుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ లింగయ్య తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతుల కల నెరవేరింది

- ఎమ్మెల్యే వేముల వీరేశం


నార్కట్‌పల్లి : బి.వెల్లంల ప్రాజెక్టు చెరువు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం


నార్కట్‌పల్లి : లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి : బి.వెల్లంల ఉదయసముద్రం ప్రాజెక్టు ద్వారా సాగునీరందించి రైతుల ఏళ్ల కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుకు రెండు రోజుల నుంచి పంపుహౌస్ ద్వారా నీటిని విడుదల చేస్తున్న సందర్భంగా శనివారం ఆయన ప్రాజెక్టులో చెరువు వద్ద పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చిరకాల కళ నెరవేరిందన్నారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రాజశేఖర్‌రెడ్డితో ప్రాజెక్టు శంకుస్థాపన చేయించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 10ఏళ్ల తర్వాత నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పూర్తి చేసుకుంటున్నట్లు వివరించారు. ప్రథమంగా 50 వేయిల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టులో భాగంగా ఎడమ, కుడి కాల్వల పనులను త్వరలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి చేయడానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు ఈ ప్రాంత రైతాంగం తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంబుజా సిమెంట్ పరిశ్రమకు మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య భూములు ఇప్పించింది వారే అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊషయ్య, మాజీ ఎంపీపీ పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డి, వడ్డే భూపాల్‌రెడ్డి, సట్టు సత్తయ్య, దూదిమెట్ల సత్తయ్య, బింగి కొండయ్య, జేరిపోతుల భరత్, వడ్డేగోని నర్సింహ, గోపాల్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, బింగి మహేష్, ప్రజ్ఞాపురం సత్తి, సమాద్, నర్సింహ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి.. పేదింటి ఆడబిడ్డలకు వరం

నార్కట్‌పల్లి : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు వరంలాంటివని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 15మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ సుధాకర్, పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊషయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, సట్టు సత్తయ్య, దూదిమెట్ల సత్తయ్య, అచ్చాలు, దూదిమెట్ల స్రవంతి, భారత్, సైదులు, పశుపతి, గిరి, కిటు, శశిధర్‌రెడ్డి, నర్సింహ, ఆజీజ్ ఉన్నారు.

బీటీరోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి

కేతేపల్లి : మండలంలోని చీకటిగూడెం గ్రామం నుంచి తుంగతుర్తి వరకు గల మట్టిరోడ్డును బీటీ రోడ్డుగా నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కోట పుల్లయ్య, కోట లింగయ్య, కోట పూర్ణచందరావు, గన్న రామారావు, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ఎల్ఓసీ అందజేత

మండలానికి చెందిన మట్టిపల్లి నర్సింహ కుమారుడు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడికి మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవతో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.25లక్షల ఎల్ఓసీ పత్రాన్ని శనివారం నకిరేకల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల జీపీపరిధి గంగదేవిగూడెం గ్రామానికి చెందిన జక్కలి మమత అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆమెకు మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.50లక్షల ఎల్ఓసీని శనివారం నకిరేకల్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని వినతి

చండూరు : గ్రామీణ ప్రాంతాలకు గతంలో నడిపిన ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండా శ్రీశైలం కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజశేఖర్‌కు ఆయన పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీశైలం మాట్లాడారు. మునుగోడు, గట్టుప్పల్, నారాయణపురం మండలాల పరిధిలో రద్దు చేసిన ఆర్టీసీ బస్సులను వెంటనే తిరిగి నడిపించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కర్నాటి మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ దోడ యాదవరెడ్డి, మునుగోడు మండల కార్యదర్శి సాగర్ల మల్లేష్, మండల నాయకులు మిర్యాల భరత్, వరికుప్పల ముత్యాలు, కర్నాటి సుధాకర్, పగిళ్ల మధు, నరసింహ, వెంకటేశ్వర్లు, నరసింహ, తదితరులు ఉన్నారు.

29న ధర్మయుద్ధ మహాసదస్సు

నకిరేకల్ : ఎస్సీ వర్గకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరుతూ ఈనెల 29న నల్లగొండ పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్మయుద్ధ మహాసదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడి శంకర్‌మాదిగ కోరారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ అమలు అయ్యేంత వరకు ప్రభుత్వం ఎలాంటి నోటిఫికేషన్లు జారీ చేయవద్దన్నారు. సమావేశంలో నాయకులు వంటిపాక కిరణ్, నకిరేకంటి నిరంజన్, రమాకాంత్, గుడెపురి సురేష్, ప్రసాద్ ఉన్నారు.

ప్లీనరీని విజయవంతం చేయాలి


ప్లీనరీ కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

మర్రిగూడ : హైదరాబాద్ పరిధిలోని ఆదిబట్లలో నవంబర్ 3న నిర్వహించే ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్లీనరీ మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు లవంగి వినోద్‌మహరాజ్ కోరారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ ప్లీనరీ సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కోకన్వీనర్ గిరి, మండల ఉపాధ్యక్షుడు రాజు, లక్ష్మణ్, జగన్, రేణుక, యాకుబ్, రాజు, మురళి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీసీతారాముల కల్యాణం


ఉత్సవ విగ్రహాలను తీసుకువస్తున్న సేవా సమితి ప్రతినిధులు

నకిరేకల్ : లోక కళ్యాణార్థం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీసత్యసాయి మందిరం ఆవరణలో మూడు రోజుల పాటు నిర్వహించే దేవతామూర్తుల కల్యాణ వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు శనివారం ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు శ్రీసీతారామ కల్యాణం నిర్వహించారు. తొలుత భగవాన్ మందిర ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, ఆఖండ దీపారాధన, రుద్రాభిషేకాలు చేపట్టారు. ఆదివారం సువర్చలా హనుమ కల్యాణం జరగనుంది. ఉత్సవాల్లో మందిరం అధ్యక్షుడు గర్రె శ్రీనివాస్, సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకట్రావ్, పుట్టపర్తి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్, పెదపాడుకు చెందిన బ్రహ్మశ్రీ కరెడ్ల సూర్యనారాయణ, బ్రహ్మశ్రీ శిష్టాచంద్రశేఖర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ జంధ్యాల గౌరీనాథశాస్త్రీ, సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు దేవరశెట్టి శ్రీనివాస్‌లు, మిట్టపల్లి యాదగిరి పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుంటే ప్రజలే కొడతారు


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నల్లగొండ టూటౌన్ : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే కాంగ్రెస్ నాయకులను ప్రజలే చీపుర్లతో కొడతారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. శనివారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకుడు కటికం సత్తయ్యగౌడ్, మాజీ ఎంపీపీ కరీంపాషా, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి మాట్లాడారు. అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుపై కోమటిరెడ్డి సోదరులు తమ వైఖరి స్పష్టం చేయకుండా ప్రజలకు ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు పట్ల సీఎం, మంత్రులు బజార్ రౌడీల్లా మాట్లాడుతున్నారని అన్నారు. పార్టీ నుంచి వలస వెళ్లిన ప్రజాప్రతినిధులపై కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి నమ్మకం లేదని, వారికి రానున్న ఎన్నికల్లో టికెట్లు రావని, కోమటిరెడ్డి మెప్పు పొందేందుకు రూ.1350కోట్లు తెచ్చి అభివృద్ధి చేసిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. పార్టీ నాయకుడు కందుల లక్ష్మయ్య మాట్లాడుతూ.. భూపాల్‌రెడ్డి కాళ్లు మొక్కి ఎంపీపీ, జెడ్పీటీసీ అయ్యింది ఎవరో అందరికి తెలుసన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మెరుగు గోపి, మాలె శరణ్యారెడ్డి, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, సింగం రామ్మోహన్, వంగాల సహదేవరెడ్డి, వెంకట్‌రెడ్డి, గున్‌రెడ్డి యుగంధర్‌రెడ్డి, మారగోని గణేష్, మేడిశెట్టి యాదయ్య, రావుల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే పేద ప్రజలకు న్యాయం


బీజేపీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న కడియం రామచంద్రయ్య

కట్టంగూర్ : బీజేపీతోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ సభ్యత్వ ప్రభారి కడియం రామచంద్రయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీఎం మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నకిరేకంటి మొగులయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న, మండల అధ్యక్షుడు పబ్బు వెంకటేశ్వర్లు, పాదూరి వెంకట్‌రెడ్డి, గున్నాల నాగరాజు, కోమటి భాస్కర్, బత్తిని నాగరాజు, సంతోష్‌రెడ్డి, నీలం నాగరాజు, తదితరులు ఉన్నారు.